# వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



మోతడక శ్రీనిలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ప్రతినిధులు

**ఈనాడు, అమరావతి:** వయోవృద్ధుల సంరక్షణకు భారత ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక పథకాలు, చట్టాలను ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ కంఫర్ట్ హోమ్ (శ్రీనిలయం)ను మంగళవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ పౌరులందరూ సామూహికంగా నివసించడానికి కేంద్రం ఏర్పాటు చేసుకోవడం మంచిదే అయినా మనం ఎక్కడికి పోతున్నాం.. ఏమైపోతున్నాం. ఇంట్లో ఉండకుండా ఇక్కడ ఉండాల్సిన పరిస్థితి ఏమిటి? ఇంట్లో వాళ్లు ఏమైపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబాలే కాదు. క్రమంగా కుటుంబ వ్యవస్థ లేకుండా పోవడం చాలా బాధాకరమన్నారు. సొంతూరిలో ఉంటూ తల్లిదండ్రులను పిల్లలు దూరం పెట్టడం మంచిదికాదని హితవు పలికారు. గతాన్ని, భవిష్యత్తును కలిపే వారధి పెద్దలు. వారధులు సారథులుగా ఉండి కుటుంబాన్ని నడిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, భాష్యం ప్రవీణ్, గళ్లా మాధవి, నసీర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



## వందేభారత్ ఎక్కే భాగ్యమేది?

**పల్నాడు ప్రాంతంలో ఆగని రైలు**

న్యూస్‌టుడే, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల

రైల్వేశాఖ పల్నాడుపై వివక్ష చూపుతోంది. గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలోని నడికుడి జంక్షన్‌లోనూ వందేభారత్ రైలును నిలపడం లేదు. ఈ రైలు నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి తదితర స్టేషన్ల మీదుగా వెళుతోంది. ప్రారంభంలో కొన్నిస్టేషన్లకే పరిమితమైన వందేభారత్ ఆ తర్వాత పలు స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకున్నా పల్నాడుకు మాత్రం నిరాశే ఎదురైంది. తెలంగాణలో అధిక స్టాప్‌లు ఇస్తున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చొరవ తీసుకుని పల్నాడులోని స్టేషన్లల్లోనూ నిలిపేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### నడికుడి జంక్షన్‌లో నిలిపితే..

సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వందేభారత్ రైలు మొదట్లో నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరులో మాత్రమే ఆగేది. తిరుగు ప్రయాణంలోనూ ఇవే స్టాపులు. ఇటీవల నల్గొండకు 38 కిలోమీటర్ల దూరంలోని మిర్యాలగూడకు స్టాపు ఇచ్చారు. ఆ తర్వాత గుంటూరు వరకు ఎక్కడా స్టాపింగ్‌లు లేవు. నడికుడి జంక్షన్‌లో నిలిపితే గురజాల, మాచర్ల నియోజకవర్గ ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉంటుంది. అటు తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఇటు విజయవాడకు వెళ్లడానికి అనుకూలమవుతుంది. మాచర్ల నుంచి గుంటూరు వరకు ఒకే ప్యాసింజర్ రైలు తిరుగుతోంది. మరో రైలు నడిచేలా చూస్తామని నరసరావుపేటకు పనిచేసిన ఎంపీలు గత 30 ఏళ్లుగా చెబుతూనే ఉన్నారు. కొత్త రైలు మాటేమో గానీ.. ఉన్న దానికి బోగీలు పెంచాలన్న డిమాండ్ కూడా నెరవేరడం లేదు.

**రైలు మార్గం ఉన్నా ప్రయోజనం లేదు**



పల్నాడు మీదుగా రైలు మార్గం ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. దూరప్రాంతాలకు వెళ్లాలంటే అటు గుంటూరు.. ఇటు నల్గొండకు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. హైదరాబాద్ నుంచి వచ్చే వారికి రాత్రివేళ పల్నాడు మీదుగా వెళ్లే వందేభారత్ రైలు నిలిపితే ఉపయోగం. అలాగే నర్సాపూర్, డెల్టా, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లకు నడికుడిలో స్టాపింగ్‌లు ఇవ్వాలి. – అజయ్, గురజాల

**వ్యయప్రయాసలు తప్పడం లేదు**



వందేభారత్ రైలుకు నడికుడిలో స్టాపింగ్ ఇవ్వాలి. పల్నాడు జిల్లాలో ఎక్కడా ఆగడం లేదు. తిరుపతి వెళ్లాలంటే గుంటూరు వెళ్లి అక్కడ రైలు ఎక్కాల్సి వస్తోంది. దీనివల్ల వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నాం. నిత్యం ప్రయాణించే వ్యాపారులు, ఉద్యోగులు అధిక ఛార్జీలు చెల్లించి బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రైళ్లను పల్నాడులోని అన్ని స్టేషన్లల్లో నిలిపేలా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చొరవ చూపాలి. – చైతన్య, శ్రీనివాసపురం, దాచేపల్లి మండలం

## ఉపాధి పనుల్లో దోచి.. రికార్డులు దాచి..

**సామాజిక తనిఖీలకు సహకరించని ఫీల్డ్ అసిస్టెంట్లు**

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నకరికల్లు

ఉపాధిహామీ పనుల్లో సామాజిక తనిఖీలకు వచ్చే అధికారులకు ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించడం లేదు. రికార్డులు ఇళ్లల్లో దాచుకుంటున్నారు. మేం ఇవ్వమని కొన్నిచోట్ల తెగేసి చెబుతున్నారు. దీంతో తనిఖీలకు వచ్చిన రిసోర్స్ పర్సన్లు చేసేదిలేక వెనుదిరుగుతున్నారు. తాజాగా నకరికల్లు మండలంలో సామాజిక తనిఖీ వాయిదాపడడానికి ప్రధాన కారణం అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు రికార్డులు ఇవ్వకపోవడమేనని తెలిసింది. దీపావళి తర్వాత రికార్డులు అప్పగిస్తామని, అప్పుడు సామాజిక తనిఖీ నిర్వహించుకోవాలని చెప్పినట్లు సమాచారం.

### నకరికల్లు మండలంలో ఎక్కువ పనిదినాలు?

జిల్లాలో 2023-24 సంవత్సరానికి ఎక్కువ ఉపాధిహామీ పనిదినాలు కల్పించిన మండలంగా నకరికల్లు మొదటిస్థానంలో ఉండడం అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఏటా మొదటిస్థానంలో బొల్లాపల్లి, రెండోస్థానంలో ఈపూరు ఉంటాయి. ఎందుకంటే ఈ రెండు మండలాల్లో ఎక్కువమంది గిరిజనులు ఉంటారు. వీరే పనులకు వెళుతుంటారు. మిగతా మండలాల్లో వ్యవసాయ పనులు బాగా జరుగుతాయి. ఉపాధిహామీ పనులకు వెళ్లేవారు మిగతాచోట్ల తక్కువ. పైగా నకరికల్లు జిల్లాలోనే ఎక్కువ వరిసాగయ్యే మండలం. అలాంటి మండలంలో ఎక్కువమంది ఉపాధిహామీ పనులకు వెళ్లారని, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇస్తున్న రికార్డుల్లో ఏదో మతలబు ఉందని అర్థమవుతోంది. అందుకే సామాజిక తనిఖీలకు సహకరించకుండా, తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు మస్టర్లలో నమోదుకు ఎక్కువ వ్యత్యాసం కనిపించడంతో అవకతవకలు జరిగినట్లు బయటపడింది. చేయని పనులకు ఎం.బుక్కులు, మస్టర్లలో నమోదు చేసి ఉపాధి నిధులు స్వాహా చేశారు. ఈ ఒక్క మండలంలో మొత్తం రూ.7.8 కోట్లు ఉపాధి పనులు, రూ.2 కోట్ల మెటీరియల్ పనులు చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు భారీగా చూపించడం పలు అనుమానాలకు తావిస్తోంది.



**పార్టీ మనుషులే ఫీల్డ్ అసిస్టెంట్లు**

ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఎక్కువగా ఆయా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సూచించిన మనుషులే ఉంటారు. ఇదీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారు వస్తుంటారు. గత అయిదేళ్లలో జిల్లాలో అన్నిచోట్లా ఎక్కువగా వైకాపా సానుభూతిపరులే ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉన్నారు. వారు ఆడిందే ఆట అన్నట్లు ఉపాధిహామీ పథకం సాగింది. బెంగళూరు, హైదరాబాద్‌ల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవారు.. ప్రభుత్వ ఉద్యోగానికి విజయవాడ, గుంటూరుల్లో ఉంటూ సిద్ధమవుతున్నవారు.. ఇలా ఊర్లో లేని వారిని ఉపాధిహామీ పని జాబితాలో చేర్చి పనిచేస్తున్నట్లు హాజరు చూపించి భారీగా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశారు. ఇలాంటివి బయటపడతాయని ముందస్తుగా సామాజిక తనిఖీని వాయిదా వేయించారని తెలుస్తోంది. దీపావళి తర్వాత రికార్డులు ఇస్తామని చెప్పడం వెనుక ఇదే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆలోపు ఎక్కడెక్కడ ఉన్నవారిని పిలిపించుకొని ఇదిగో ఉపాధి హామీ కూలీలని చెప్పవచ్చేనే ఎత్తుగడగా అర్థమవుతోంది.

**అవకతవకలు జరిగితే చట్టపర చర్యలు**

నకరికల్లు మండలంలో సామాజిక తనిఖీ ఇప్పటికి రెండుసార్లు వాయిదా పడింది. చాలామంది ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులను వారి వద్దే ఉంచుకున్నారు. కొత్తరికార్డులు తయారుచేసి మంగళవారానికి అందజేయాలని గత శుక్రవారం చెప్పాం. అయినా అందజేయలేదు. 2023-24 ఉపాధిహామీ రికార్డులను సకాలంలో అందజేయని ఉపాధిహామీ సిబ్బందిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – సిద్ధాలింగమూర్తి, డ్వామా పీడీ

## మృతులు వచ్చి.. పనులు చేశారట

- ఉపాధి హామీలో వింతలు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకూ పథకం కింద వేతనాలు

**ఈపూరు, న్యూస్‌టుడే :** మండలంలో ఉపాధి హామీ పథకం పనుల్లో అనేక అక్రమాలకు పాల్పడ్డారు. కొన్ని గ్రామాల్లో మస్టరులో సంతకాలు, వేలి ముద్రలు లేకపోయినా నగదు చెల్లించారు. మరి కొన్ని గ్రామాల్లో ఒక్క కూలీతో అవి తీసుకుని వేతనాలు చెల్లించారు. ఇంకొన్ని గ్రామాల్లో మృతులు, నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల పేర్లతో చెల్లించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఇవన్నీ బయటపడ్డాయి. మండలంలోని ముప్పాళ్ల, కొండ్రముట్ల, కొచ్చెర్ల, అగ్నిగుండాలలో మంగళవారం సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. డీఆర్పీలు తనిఖీ నివేదిక చదివి వినిపించారు.

❖ ఆయా గ్రామాల్లో మస్టరులో సంతకాలు, వేలి ముద్రలు లేకుండా నగదు చెల్లించారు. మస్టరు ముగిసిన తర్వాత పేర్లు ఎక్కించడం, దిద్దుబాట్లు చేసి చెల్లింపులు జరిపారు. కొచ్చెర్లలో మృతుల పేర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వేరే పట్టణంలో ఉన్న వ్యాపారులు, సచివాలయం ఉద్యోగి, వాలంటీరు పేర్లు, అసలు పనికి రానివారి పేర్లతో చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. నాలుగు గ్రామాల సభలకు స్వతంత్ర పరిశీలకులు హాజరుకాలేదు. కొచ్చెర్ల, అగ్నిగుండాలలో పనులకు ముందస్తు కొలతలు తీయలేదు. కొండ్రముట్ల, అగ్నిగుండాలలో పాస్ ఆర్డర్ వివరణ లేకుండా పంపారు. చెక్ మెజర్‌మెంట్ సక్రమంగా వేయలేదు. గ్రామసభల్లో ఎస్ఆర్పీ జేఎస్ రాజు, సర్పంచి కోపెల దేవరాజు, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, ఏపీవో లక్ష్మణరావు, డీఆర్పీలు పవన్‌కుమార్, కీమానాయక్, శ్రీనివాసరావు, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



కొచ్చెర్ల గ్రామసభలో సామజిక తనిఖీ నివేదిక వెల్లడిస్తున్న డీఆర్పీ మల్లికార్జునరెడ్డి

## తగ్గిన వరద ప్రవాహం

**విజయపురిసౌత్, న్యూస్‌టుడే:** ఎగువ కృష్ణా పరివాహక ప్రాంతంలో మూడ్రోజులుగా వరద పెరగడంతో 20 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. అయితే మంగళవారం ఎగువన వరద తగ్గుముఖం పట్టడంతో దిగువ జలాశయాలకు నీటిచేరిక తగ్గింది. దీంతో నాగార్జునసాగర్ రెండు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 15,948 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,435 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి

**ఈనాడు, అమరావతి:** సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట వేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. కేసుల దర్యాప్తుల్లో సాంకేతికతను జోడిస్తే ఫలితాలు వేరుగా ఉంటాయని చెప్పారు. ఇటీవల బాపట్ల జిల్లా మేదరమెట్ల స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ దారి దోపిడీని కేవలం 48 గంటల్లో ఛేదించడానికి ఆ పరిజ్ఞానమే దోహదపడిందన్నారు. మంగళవారం సాయంత్రం రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలతో ఆయన గుంటూరులోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు నివాసంపై గతంలో జరిగిన దాడుల కేసుల పురోగతి, ఆధారాలు ఎలా సేకరించిందీ ఎస్పీలకు వివరించారు. రఘురామకృష్ణరాజు కేసు పురోగతిపైనా చర్చించారు. ఎస్పీలు సతీష్‌కుమార్ కె.శ్రీనివాసరావు, తుషార్ డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఐజీ చేసిన సూచనలు...

❖ ప్రతి స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఏ నేరం జరిగినా వెంటనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించేలా అవి ఉండాలి. ❖ గతంలో మాదిరి ప్రతీ కానిస్టేబుల్‌కు ఒక ప్రాంతాన్ని దత్తత ఇచ్చి అక్కడ ఏం జరిగినా సమాచారం వచ్చేలా చూడాలి. ❖ రెగ్యులర్ కేసులను పర్యవేక్షిస్తూనే వాటి పెండెన్సీని చాలా వరకు తగ్గించాలి. ❖ రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. ప్రతి వారం కౌన్సెలింగ్ చేస్తూ వారి కదలికల్ని తెలుసుకోవాలి. ❖ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టి విద్వేషాలను రెచ్చగొట్టేవారిని కట్టడి చేయాలి. ❖ సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాట్లు చేయాలి. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు తావులేకుండా ఉక్కుపాదం మోపాలి. వాటి పర్యవసానాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

## ఏటిగట్టుకు ముప్పు.. ఏదీ కనువిప్పు!

- గతంలో ఇసుక లారీల రవాణాతో కరకట్ట బలహీనం
- వరదల వేళ వణుకుతున్న పరిసర గ్రామాల ప్రజలు

న్యూస్‌టుడే, అమరావతి

చారిత్రక అమరావతి ప్రాంతంలో కృష్ణానది వరద నుంచి కాపాడే కరకట్టకు కొంతమంది అక్రమార్కులు ముప్పు తెస్తున్నారు. ఇసుకాసురుల ధనదాహానికి వైకుంఠపురం వద్ద కరకట్ట బలహీన పడుతోంది. రోజూ వందల సంఖ్యలో లారీలు కరకట్ట మీదుగా ప్రయాణించడంతో కట్ట కుంగి ధ్వంసమవుతోంది. గ్రామాలకు రక్షణగా ఉన్న కరకట్ట భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. గతంలో కరకట్ట మీదకు భారీ వాహనాలు ప్రవేశించకుండా గడ్డర్లు ఉండేవి, వాటిని ఇసుకాసురులు తొలగించడంతో సమస్య తీవ్రమవుతోంది.

గత నెలలో కృష్ణానదికి భారీగా వరద రావడంతో ఎప్పుడు కరకట్ట వైపు నుంచి ముప్పు ఉంటుందోనని కరకట్ట కింద ఉన్న గ్రామాలు వణికిపోయాయి. వైకుంఠపురం గ్రామానికి కృష్ణానది వరద రాకుండా రెండు వైపులా కరకట్ట నిర్మాణం చేపట్టారు. గత నెలలో వచ్చిన వరదలకు పది అడుగుల ఎత్తు ఉన్న కరకట్ట అంచుల వరకు నీరు వచ్చింది. మరో అడుగు వరద పైకి వస్తే కట్టకు గండి పడి భారీ ముప్పు వాటిల్లేది. ఈ క్రమంలో వైకుంఠపురం వాసులు కంటి మీద కునుకు లేకుండా కరకట్టకు మట్టి, ఇసుక బస్తాలు వేసి ముప్పును ఆపేందుకు తీవ్రంగా కృషి చేశారు. గ్రామం మొత్తం కంటి మీద కునుకు లేకుండా రాత్రంతా కరకట్టమీదే ఉంది. కట్టకు గండి పడితే వైకుంఠపురంతో పాటు రాజధాని పరిధిలోని పదుల సంఖ్యలో గ్రామాలు ముంపునకు గురై ప్రమాదం ఉండటంతో తీవ్రత గుర్తించిన కలెక్టర్ అరుణ్‌కుమార్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముగ్గురూ అర్ధరాత్రి వేళ వైకుంఠపురం చేరుకొని కరకట్టకు మరమ్మతులు చేయించారు. వరద ప్రమాదపు అంచువరకు వచ్చి తగ్గడంతో పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కరకట్టను కొందరు అక్రమార్కులు బలహీన పరుస్తున్నా అధికారులు మిన్నకుండి పోవడంతో వరదలు వచ్చినప్పుడల్లా లోతట్టు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు.



ఇసుక లారీలు తిరగడంతో గోతులు పడిన కరకట్ట

**ఐదేళ్లలో విచ్చలవిడిగా**

వైకుంఠపురం ఇసుక రీచ్ నుంచి గత ఐదేళ్లలో వైకాపా నేతలు ఉత్తర దిక్కున ఉన్న కరకట్ట మీద నుంచి ఇసుక రవాణా చేశారు. దీంతో కరకట్ట కుంగడంతో పాటు బలహీన పడింది. ఇసుక రీచ్ నుంచి వెళ్లే వాహనాలు పరిమితికి మించి వెళ్లడంతో కట్ట దెబ్బతింది. 18 టన్నులు పరిమితి ఉన్న లారీకి 30 టన్నులు, 25 టన్నులు ఉన్న లారీకి 50 టన్నులు ఇసుక నింపి కరకట్ట మీదుగా రవాణా చేయడంతో కట్ట మీద భారీ గోతులు పడ్డాయి. కట్ట అంచులు దెబ్బతిన్నాయి. వర్షాకాల సమయంలో గోతుల్లో లారీలు ఇరుక్కు పోయిన సంఘటనలు జరిగాయి.

## మిర్చి రైతుకు ఎగుమతులే అండ

### నిలకడగా ధరలు

ఈనాడు, అమరావతి

విదేశీ ఎగుమతుల కారణంగా మిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దేశీయంగా గిరాకీ తక్కువగా ఉన్నా.. చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక, సింగపూర్, మలేసియా తదితర దేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు మిర్చియార్డులో రోజుకు 50 వేలకుపైగానే బస్తాల క్రయవిక్రయాలు నమోదవుతున్నాయి. మరోవైపు పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని పంట దేశీయ అవసరాలకు సరిపోతుందని అంచనా. ఈ దిగుబడుల ప్రభావం మన మార్కెట్‌పై లేదని సంబంధితవర్గాలు విశ్లేషిస్తున్నాయి. దేశీయంగా ఉన్న నిల్వలు, ఎగుమతుల తీరు, నవంబరు నెలాఖరులో వచ్చే కొత్త సరకు పరిమాణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్న వ్యాపారులు కొనుగోళ్లను పెంచారు. ఫలితంగా ధరలు తగ్గకుండా నిలకడగా కొనసాగుతున్నాయి. ధరలు మరింతగా పెరిగేందుకు అవకాశం ఉన్నా.. నాణ్యమైన డీలక్స్ రకాల లభ్యత తక్కువగా ఉండడం అడ్డంకిగా మారింది. గతేడాది నిల్వలను ఇప్పుడు విక్రయిస్తుండడం వల్ల నాణ్యత కొంత తగ్గిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. కొత్త పంట ఆలస్యం కావడం, ఎగుమతులు ఇదేవిధంగా ఉంటే దీపావళి తరువాత నాణ్యమైన సరకుకు ధర పెరిగే అవకాశం ఉందని మార్కెట్‌వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ప్రస్తుతం డిమాండ్ ఉన్న రకాలు: తేజ, బాడిగ, డీడీ. వీటిని అమ్మడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.**



గుంటూరు మిర్చియార్డులో క్రయవిక్రయాలు

**నిల్వలు 60 లక్షల బస్తాల కుపైగానే... :** గుంటూరు పరిసర శీతల గోదాముల్లో 40 లక్షల బస్తాల వరకు మిర్చి నిల్వలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 60 లక్షల బస్తాలకుపైగానే నిల్వలున్నాయి. గతంలో ఎన్నడూలేనివిధంగా అక్టోబరు చివరివారం నాటికి పెద్దఎత్తున నిల్వలు ఉండడం ధరలపై ప్రభావం చూపుతోంది. మధ్యప్రదేశ్‌లో ఈసారి రైతులు ఎక్కువగా పచ్చిమిర్చి విక్రయిస్తుండడంతో మార్కెట్‌కు ఎండుమిర్చి రాక ఆలస్యమైంది. ఇప్పుడిప్పుడే అక్కడ రోజుకు 5 వేల నుంచి 7 వేల బస్తాలు వస్తున్నాయి. అక్కడ ఎండుమిర్చి 10 లక్షల నుంచి 12 లక్షల బస్తాలకే పరిమితమవుతుందని అంచనా. ఇది అక్కడి అవసరాలకు సరిపోతుందని అంచనా. మన రాష్ట్రంలో ఈసారి సాగు విస్తీర్ణం తగ్గడం, కొత్త పంటపై ఇంకా అంచనాలు రాలేదు. గుంటూరు మిర్చియార్డుకు తొలుత సరకు వచ్చేది కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచే. నవంబరు నెలాఖరు నుంచి కొత్త సరకు వస్తుందని అంచనా. కాలువలకు సమృద్ధిగా నీటిని విడుదల చేస్తున్నా.. అధిక వర్షాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల కొత్తపంటపై ఇప్పుడే అంచనా వేయలేమని మార్కెట్‌వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**మిర్చి యార్డుకు అక్టోబరు 18న వచ్చిన బస్తాలు 43,523. విక్రయించినవి 50,503 బస్తాలు. నిల్వ 19,806 బస్తాలు. ఆ రోజు రైతులకు లభించిన ధరలు**

| రకం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| | (అంకెలు రూపాయల్లో) | |
| 334 | 8,200 | 16,000 |
| నంబరు5 | 8,500 | 16,000 |
| 341 | 9,000 | 16,000 |
| 273 | 12,000 | 13,500 |
| తేజ | 8,000 | 18,500 |
| బాడిగి | 8,500 | 16,500 |
| డీడీ | 9,000 | 16,000 |

## రహదారుల ప్రమాదాల నియంత్రణకు చర్యలు: కలెక్టర్

**నరసరావుపేట అర్బన్:** జిల్లాలో రహదారులపై ప్రమాదాల నియంత్రణ, మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రహదారి భద్రత, మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణపై ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారుల వెంట జంక్షన్ల వద్ద సైన్‌బోర్డుల ఏర్పాటు, తగినంత లైటింగ్, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మరణాలు తగ్గించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణాలు ధరించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అధిక లోడు, మితిమీరిన వేగాన్ని నియంత్రించాలని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. నరసరావుపేట పట్టణంలో పార్కింగ్‌కు స్థలాల ఏర్పాటు చేయాలని, రహదారులకు ఇరువైపులా ముందుకు వచ్చిన దుకాణాల యజమానులతో మాట్లాడి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మండలాల వారిగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గంజాయి రవాణా నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



సమీక్ష చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పక్కన ఎస్పీ శ్రీనివాసరావు

## స్కూల్‌గేమ్స్ ఉమ్మడి జిల్లా సైక్లింగ్ జట్ల ఎంపిక రేపు

**నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే :** జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 24న ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల, బాలికల సైక్లింగ్ జట్ల ఎంపికను నాదెండ్ల మండలం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. జట్ల ఎంపిక ఇన్‌ఛార్జులుగా షేక్ ఇస్మాయిల్, ఎంవీ సుబ్బారావు, పి.ఖాదర్‌మస్తాన్, సైక్లింగ్ కోచ్ కనకారావు వ్యవహరిస్తారని చెప్పారు. ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

# సనాతన ధర్మం కాపాడటమే లక్ష్యం


గజల్స్ పాడుతున్న గజల్ శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యే జీవీ, స్వామీజీలు

**వినుకొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** దేశంలో సనాతన ధర్మం జోలికెళ్లిన వారంతా చిరునామా లేకుండా పోయారని, అందుకు రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సకల సాంస్కృతిక కళాకారులు, గురువుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయాలు, అర్చకులపై దాడులతో పాటు సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని కుట్ర చేసిన అయిదేళ్ల జగన్ పాలనకు ప్రజలే సరైన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించడం కూడా సనాతన ధర్మమేనని చెప్పారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా.. సనాతన ధర్మ ప్రచారమే లక్ష్యంగా ముందుకు సాగి పదికాలాల పాటు భావితరాలకు కూడా ఒక మంచి అభివృద్ధి, శాంతిని అందించాలని కోరారు. ఆయన గజల్స్ ఆలపించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 600 మంది కళాకారులను సత్కరించారు. 1000 దేవాలయాలకు ధూప, దీప నైవేద్యాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి, ఉపాధ్యక్షుడు దయానంద దత్త స్వామి, బాలసిద్ధ పీఠం నుంచి పూజ్య భవానీ స్వామి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు భైరవానంద స్వామీజీ, సంధ్యాస్వామి, అహోరా పీఠం నుంచి విజయశంకర స్వామి, అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి రుద్ర శివానంద సరస్వతి స్వామీజీ, మౌన స్వామి ఆశ్రమం పీఠాధిపతి, జనసేన నేత నాగ శ్రీను, భాజపా నేత మేదం రమేష్, పలువురు గురూజీలు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# అమరావతి అద్భుతం

**అమరావతి, న్యూస్‌టుడే:** నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కాశ్మీరుకు చెందిన యువత మంగళవారం అమరావతిని సందర్శించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి వచ్చిన 132 మంది ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పురావస్తు ప్రదర్శనశాల, మహాచైత్యం సందర్శించారు. ఉండవల్లి గుహలను కూడా వారు సందర్శించారు. అమరావతి అద్భుతంగా ఉందని కొనియాడారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కిరణ్మయి, వైజాగ్ జిల్లా అధికారి మహేశ్వరరావు, సురేష్‌బాబు, జన చైతన్య సమితి ప్రతినిధులు జెన్నిబాబు, అనిల్ పాల్గొన్నారు.


ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద కాశ్మీరీ యువత

# అత్యాధునిక వసతులతో సొంతింటి కల సాకారం

**గుంటూరు:** ఆధునిక వసతులతో ప్రజల సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీరామ్ టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గళ్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీరామ్ హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9వేలమందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీరామ్ టౌన్‌షిప్స్ ప్రారంభించామని తెలిపారు. గుంటూరు, కృష్ణ, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులను రూపకల్పన చేసి అభివృద్ధి చేసి స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రావు, లక్ష్మీపతి రాజు, తెలాడిశెట్టి, యద్దపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కార్ల సతీష్, కృష్ణ రవి తదితరులు పాల్గొన్నారు.


దీపారాధన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ రామచంద్రరావు



# పల్లె ప్రగతికి.. ధరల గుదిబండ

✦ నిర్మాణ పనులకు లభించని ఇసుక ✦ కంకర రాళ్లకు డబుల్ సినరేజ్
✦ పనులకు వెనుకాడుతున్న నిర్వాహకులు

నరసరావుపేట టౌన్, గణపవరం (నాదెండ్ల), న్యూస్‌టుడే

నరసరావుపేట మండలంలోని 24 గ్రామాలను పల్లె పండగ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు 5 కి.మీ., మురుగు కాలువలు 3 కి.మీ., తారు రోడ్లు 0.73 కి.మీ., పొడవున నిర్మించాల్సి ఉంది. ఈ నెల 14 నుంచి పనులకు భూమిపూజలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించడమే తప్ప ఎక్కడ కూడా పనులు శ్రీకారం చుట్టలేదు. పనులు వెంటనే మొదలు పెట్టలేదు. రేట్లు, నిర్మాణ సామాగ్రి అందుబాటులో లేక స్తబ్దత నెలకొంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుంటే కాని వీటిని జిల్లాలో ఎక్కడ కూడా నిర్వహించలేమన్న అభిప్రాయం స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వ్యక్తమైంది.

✦ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీల్లో అభివృద్ధి పనులను పాలకులు మంజూరు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు సిమెంట్ నిర్మాణాలు, తారురోడ్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే వీటిని చేసేందుకు సర్పంచులు అంతగా ఆసక్తి చూపడం లేదు. వీరి అనుమతితో పనులు దక్కించుకునే గుత్తేదారులు కూడా వెనుకడుగు వేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. బహిరంగ మార్కెట్లో నిర్మాణ సామాగ్రి ధరలు భారుపెడుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారం ప్రస్తుతం ఏ ఒక్క సామాగ్రి కూడా కొనలేమని చేతులు ఎత్తేస్తున్నారు. సిమెంట్ ధర బస్తాకు రూ.30 అదనంగా పలుకుతోంది. జిల్లాకు మంజూరు చేసిన పనులన్నిటికీ కలిపి 10 వేల మెట్రిక్ టన్నుల సిమెంట్, 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంది. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో టన్ను ఇసుక రూ.1400 రేటు పలుకుతోంది. ఇది ఉచితం కాదటంతో రవాణా, లోడింగ్ ఖర్చులు వెరసి టన్నుకు రూ.699.37 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే రెట్టింపు ధర పెట్టినప్పటికీ ప్రస్తుతం ఇసుక లభించని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 9 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇది కూడా ప్రజల అవసరాల కోసం కేటాయించడం సరిపోవడం లేదు. కృష్ణానదిలో నీటి ప్రవాహం దృష్ట్యా ఇసుక తవ్వకాల్లో జాప్యం అవుతోంది. దీంతో ఇసుక కొరత పనుల నిర్వహణకు పెద్ద సమస్యగా మారింది.


కనపర్రు బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించిన అధ్వాన రహదారి

## కంకర రాళ్లు కొనేది ఎలా..?

కంకర రాళ్ల (మెటల్) ధర అమాంతంగా పెరిగింది. క్వారీ వద్ద గతంలో టన్ను రూ.375కి విక్రయించారు. ప్రస్తుతం ఇది రూ.625 వరకు ఉంది. దీనికి రవాణా ఖర్చులు కలిపి రూ.1,108 ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో డబుల్ సినరేజ్ భారం పడుతుంది. ప్రైవేటు గుత్తేదారు సంస్థ మెటల్, గ్రానైట్, మట్టి (గ్రావెల్) తదితర ఖనిజాలకు సినరేజ్ పన్నులు వేస్తుంది. స్టోన్ క్రషర్ల దగ్గర చెక్‌పోస్టుల్లో సినరేజ్ తప్పని సరిగా చెల్లించాలి. మళ్లీ బిల్లుల్లో ప్రభుత్వం కోత విధిస్తుంది. ఇలా ఒకే సామాగ్రికి రెండుసార్లు సినరేజ్ చెల్లించాల్సి వస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు. 40వేల మెట్రిక్ టన్నుల మెటల్ కొనాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇసుక, మెటల్ కొనుగోలు వ్యవహారం భారంగా మారింది. దీనిపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటేనే పనులు చేయగలమని నిర్వాహకులు చెబుతున్నారు.

## ప్రభుత్వానికి నివేదించాం

జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు ఇసుక లభ్యత లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చాం. స్టోన్ క్రషర్ చెక్‌పోస్టుల వద్ద గుత్తేదారు మెటల్ సినరేజ్ చెల్లిస్తే.. మళ్లీ బిల్లుల్లో కోత పెట్టకుండా చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించాం. అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించేందుకు ఏజెన్సీలతో మాట్లాడుతున్నాం. -సుబ్బారాయుడు, ఇంజినీరింగ్ జిల్లా అధికారి, పంచాయతీరాజ్, పల్నాడు జిల్లా

# జిల్లాలో 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

**నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే:** నాగార్జున సాగర్ కుడికాలువ ఆయకట్టు పరిధిలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణ చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. నవంబరు 21 నుంచి 29 వరకు నిర్వహించనున్న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. జిల్లాలోని 2,868 ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీలు), 274 (డబ్ల్యూయూఏ) సంఘాలకు నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే నెల 24 నుంచి 26 వరకు 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు, నవంబరు 27 నుంచి 29 వరకు ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయకట్టుదారులతో ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు రూపొందించి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు చేపట్టనున్నారు. నోడల్ అధికారిగా ఎస్ఈ సత్యనారాయణ వ్యవహరించనున్నారు.

# అమరేశ్వరాలయ ఈవోగా సునీల్‌కుమార్



**అమరావతి, న్యూస్‌టుడే:** ప్రముఖ పంచారామ క్షేత్రం అమరావతిలోని బాలచాముండికా అమరేశ్వరాలయం కార్యనిర్వహణాధికారిగా సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన దుర్గిరాల మండలం కొలకలూరు కొండారు మహంకాళి అమ్మవారి దేవస్థానం ఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు అమరేశ్వరాలయం ఈవోగా అదనపు బాధ్యతలు ఇస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈవోగా విధులు నిర్వహిస్తున్న వేమూరి గోపి నెల్లూరు జిల్లా వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు.

# ఎలుకలు, తెగుళ్ల నివారణతో పంటల్లో అధిక దిగుబడులు

**నరసరావుపేట సెంట్రల్:** పంట పొలాల్లో ఎలుకల నివారించి, తెగుళ్లను అరికట్టినప్పుడే దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని తెలిపారు. మండలంలోని మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇందులో భాగంగా సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టింది. దీంతో రైతులు తమ పొలాల్లో ఎలుకలను నివారించుకొని పంటలు కాపాడుకోవడంతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.


**బ్రాయిలర్ ధరలు** (కిలో రూ.లలో)
లైవ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, రిటైల్ ధర - 155, విత్ స్కిన్ - 225, స్కిన్ లెస్ - 256.

# యువతా మేలుకో.. నైపుణ్యాలు అందుకో..

## వికసిత్ భారత్ లక్ష్యంగా పీఎం ఇంటర్న్‌షిప్

సత్తెనపల్లి, మాచర్ల, న్యూస్‌టుడే

పది తరగతి విద్యార్హతతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలు అందుకునే అవకాశాలున్నాయి. అయితే నైపుణ్యాలేక డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పట్టాలు అందుకున్న వారు సైతం నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాలు లేకపోవడమే అందుకు కారణం. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నూతనంగా పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి శ్రీకారం చుట్టింది. వికసిత్ భారత్ లక్ష్యంగా రూపకల్పన చేసింది. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైతే ఉపాధి, ఉద్యోగ అవకాశం పొందడం ఎంతో సులువని నిపుణులు చెబుతున్నారు.



### కోటి మందికి శిక్షణ

దేశవ్యాప్తంగా కోటిమంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారి భవితను మార్చేందుకు పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. దీనికింద ఎంపికైన విద్యార్థులకు ఆర్థిక లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకున్నారు. ఎంపికైన విద్యార్థికి నెలకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తారు. ఏడాదికి మరో రూ.6 వేలు అదనంగా (గ్రాంట్ రూపంలో) ఇస్తారు. ఇలా పలు ప్రోత్సాహకాలు అందజేయనున్నారు.

### అర్హులు ఎవరంటే..

పది, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఫార్మా చదివినవారు అర్హులు. 21 నుంచి 24 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. ఆన్‌లైన్‌లో pminternshipmca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని యువతకే ఈ అవకాశం కల్పించారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించితే అనర్హులు.

### 25వ తేదీ దరఖాస్తు గడువు

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు ఉంది. 26న షార్ట్ లిస్టు చేస్తారు. 27 నుంచి నవంబరు 7వ తేదీ వరకు అభ్యర్థులకు సంస్థను కేటాయించనున్నారు. డిసెంబరులో శిక్షణ ప్రారంభిస్తారు.

# చెరువు పూడికలో చిక్కుకొని రైతు దుర్మరణం



**బొల్లాపల్లి, న్యూస్‌టుడే:** గేదెలు తోలుకొచ్చేందుకు చెరువులోకి దిగి పూడికలో చిక్కుకొని బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయిన రైతు ఉదంతమిది. మండలంలోని కనుమలచెరువుకు చెందిన పూజల అంజయ్య (36) మంగళవారం చెరువు నీటిలోకి వెళ్లిన గేదెలను బయటకు తోలేందుకు లోపలికి వెళ్లి పూడికలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు గమనించి మృతదేహం బయటకు తీశారు. ఆయనకు భార్య తిరుపతమ్మ, ముగ్గురు పిల్లలున్నారు.

# అండర్-19 రాష్ట్ర ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

**నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎన్‌కేఆర్ఆర్ క్రికెట్ మైదానంలో అండర్- 19 రాష్ట్ర ప్రాబబుల్స్ క్రికెట్ పోటీల్లో టీం-ఎ, టీం-బి జట్ల మధ్య మంగళవారం మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన టీం-ఎ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 37.1 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌటైంది. జట్టులో చరణ్‌తేజ్ 38 పరుగులు చేశారు. టీం-బి బౌలర్ వీడీ రవిత్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం తన తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీం-బి జట్టు 49 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ నాగకుమార్ 42 బంతుల్లో 41 పరుగులు చేయగా గౌతమ్‌కృష్ణ 24 పరుగులతో, రవితేజ 12 పరుగులతో క్రీజులో ఉన్నారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి టీం-బి జట్టు 47 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# మాజీ ఎమ్మెల్యే బొల్లాపై కేసు

**వినుకొండ, న్యూస్‌టుడే:** పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలను దూషించడంతో పాటు దౌర్జన్యం చేశారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 323,506 ఐపీసీ, 34 ఐపీసీ 156 (3) సెక్షన్ కింద ఈ ఏడాది సెప్టెంబరు 23న ఎఫ్ఐఆర్ నంబరు 231/2024న వినుకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన విషయం తాజాగా వెలుగు చూసింది. మంగళవారం కోర్టు వాయిదాకు హాజరైన ఫిర్యాదుదారు కేసు వివరాలు వెల్లడించారు. గత ఏడాది డిసెంబరు 27న వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. వారికి మద్దతుగా సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే ఆయన మద్దతుదారులు తమను దూషించడంతో పాటు దౌర్జన్యం చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కె.హనుమంతరెడ్డి తెలిపారు. గత్యంతరం లేక ఈ ఏడాది జనవరి 12 కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయస్థానం జులై 31న కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించినట్లు చెప్పారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు వైకాపాకు చెందిన మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, పట్టణ సీఐ శోభన్‌బాబులపై కేసు నమోదు చేశారు.

# వృద్ధురాలి అవయవదానం

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే:** చిలకలూరిపేటకు చెందిన కోటేశ్వరమ్మ (72) హైదరాబాద్‌లో సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యుల కోరిక మేరకు అక్కడే అవయవదానం చేశారు. కోటేశ్వరమ్మ లివర్, కిడ్నీ, కళ్లు దానం చేశారు. ఆదివారం ఆమె మృతదేహాన్ని చిలకలూరిపేట తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.


కోటేశ్వరమ్మ (పాతచిత్రం)

# దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

✦ రూ.39 లక్షల నగదు స్వాధీనం

**బాపట్ల, న్యూస్‌టుడే:** జాతీయ రహదారిపై మేదరమెట్ల వద్ద బంగారం వ్యాపారి స్వరూప్‌కుమార్ నుంచి నగదు దోచిన నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.39 లక్షల నగదు, కారు, ట్రాలీబ్యాగు స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం విలేకరులకు నిందితుల వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరుకు చెందిన వ్యక్తి లారీ డ్రైవర్. అదే గ్రామానికి చెందిన అతని స్నేహితులతో కలిసి చోరీ చేయాలని నిర్ణయించారు. ఆమెకు చికిత్స నిమిత్తం నగదు సంపాదించాలని స్నేహితులతో కలిసి పథకం రూపొందించారు. వ్యాపారి కొట్టి కారులో ఎక్కించుకొని ఉన్న రూ.39.50 లక్షలు తీసుకుని కారులో పరారయ్యారు. బాధితుడు మరుసటి రోజు మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ, ఎస్సైలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. వారి నుంచి రూ.39 లక్షలు, కారు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏ1 నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసును 48 గంటల్లో ఛేదించిన నగదు రికవరీ చేసిన సీఐ, ఎస్సైలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

# నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

## ఆధార్ సమస్యల పరిష్కారానికి అవకాశం

**వినుకొండ, వినుకొండ రూరల్, నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే :** ఆధార్ కార్డు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసిందని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మంగళవారం ఒబయ్యకాలనీ సచివాలయాన్ని సందర్శించారు. వినుకొండ మండలం ఏనుగుపాలెం, నూజండ్ల మండలం ఉప్పలపాడు, జంగాలపల్లిలో ఆధార్ కేంద్రాలను మంగళవారం డీఎల్ డీవో వెంకటరెడ్డి పరిశీలించారు. 25 వరకు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## త్వరలో ఉద్యానం బాగు

**నూజండ్ల, (వినుకొండ రూరల్), న్యూస్‌టుడే :** పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అనే నినాదం మనందరిలో రావాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. పల్లెవనం కార్యక్రమంలో భాగంగా నూజండ్ల ఉద్యానాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. గతంలో కళకళలాడిన ఉద్యానం నేడు పిచ్చి మొక్కలతో ఉందని, ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించి అక్కడ అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, ఏపీవో ఆంజనేయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేట బరంపేట చాకిరాలమిట్ట, హోసన్నా మందిరం సమీపంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. **- గోపి, స్థానికుడు**

✔ నెల క్రితమే వీధి కుక్కలను పట్టించాం. మీ ఇళ్ల మధ్య ఉంటే సమాచారమివ్వండి. **- సురేష్, 33వ వార్డు కార్యదర్శి**

**- మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే**

## అనుమతిలేని మద్యం స్వాధీనం

**ఈపూరు :** మండలంలోని ముప్పాళ్లలో సోమవారం రాత్రి అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న వ్యక్తిని జిల్లా ఈఎస్‌టీఎఫ్ బృందం దాడులు జరిపి పట్టుకుంది. 45 సీసాల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుంది. ఈఎస్‌టీఎఫ్ ఎస్సై కల్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# హమ్మయ్య.. నిధులొచ్చాయ్

**జిల్లా సమాచారం**
ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల సంఖ్య : 1604
విద్యార్థుల సంఖ్య : రూ.1.80 లక్షలు

వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

ఈపూరు మండలం కొండ్రముట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులున్నారు. పాఠశాల నిర్వహణకు ఏటా రూ.50 వేల అందాల్సి ఉండగా వైకాపా పాలనలో 2022- 23 విద్యా సంవత్సరంలో తొలి విడత కేవలం రూ.10 వేలు మంజూరు చేశారు. విద్యుత్తు బిల్లులు కట్టడం ఇతరత్రా ఖర్చులకు వచ్చిన డబ్బులు చాలక ఇబ్బంది పడ్డారు. తర్వాత సంవత్సరం ఇదే పరిస్థితి. ఇలాగే అన్ని పాఠశాలలు నిర్వహణ నిధులు అందక ఇబ్బంది పడుతున్న తరుణంలో తాజాగా కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉపశమనం కలిగించింది.

❖ పదేళ్ల క్రితం సర్వశిక్ష అభియాన్ ఏర్పాటుతో పాఠశాల నిర్వహణకు (స్కూల్ మేనేజ్ మెంట్ గ్రాంటు) విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం నిధులు విడుదల ప్రారంభించింది. ఏడాది పాటు విద్యుత్తు బిల్లులు చెల్లింపు, చాక్‌పీసులు, తెల్ల పేపర్లు వంటి సామాగ్రి కొనుగోలుకు, మంచినీటి బిల్లులు,



వినుకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల

❖ చిలకలూరిపేట మండలంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలు చాలా ఉన్నాయి. కావూరు, లింగుంగుంట్ల, కోమటినేని వారిపాలెం ప్రభుత్వ పాఠశాలలకు గతంలో నిధులు రాక నిర్వహణకు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రధానోపాధ్యాయులే సొంతంగా ఖర్చు చేసి నిధుల కోసం ఎదురుచూశారు.

చిన్నపాటి మరమ్మతులకు వీటిని ఖర్చు చేయొచ్చు. విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు కేటాయిస్తారు. 1 నుంచి 30 మంది ఉన్న పాఠశాలకు రూ.10 వేలు, తర్వాత 100 వరకు రూ.25 వేలు, ఆపైన 250 వరకు రూ.50 వేలు, వెయ్యి లోపు ఉంటే రూ.75 వేలు, ఆపై పిల్లలున్న పాఠశాలలకు రూ.లక్ష ఇస్తారు.

❖ గతంలో విద్యా సంవత్సరం ముగిసే లోపు ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదలయ్యేవి. వాటి ఖర్చు బిల్లులను ఆడిట్ నాటికి సమర్పించేవారు. ఈక్రమంలో వైకాపా పాలనలో 202-22లో బిల్లుల గందరగోళంతో కొన్నింటికి అందలేదు. తర్వాత ఏడాది కోత పెట్టి 30 శాతం విడుదల చేశారు. వీటితో తరగతి గదులు నాలుగు ఫ్యాన్లు వాడకం వల్ల విద్యుత్తు బిల్లు ఎక్కువ రావడం, శుద్ధ జల కేంద్రాల నిర్వహణ ఖర్చు పెరిగి ఆర్థిక భారమై వాటిని చెల్లించడానికి కొంత మంది ప్రధానోపాధ్యాయులు ఇబ్బందిపడ్డారు.

❖ ప్రధానోపాధ్యాయులకు ఊరట దక్కింది జిల్లాలో పర్యటన సందర్భంగా పలు పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి ఈ సమస్య రాగా 2024-25 విద్యా సంవత్సరానికి నిధులు చేయించారు. వీటితో పాటు పీఎంశ్రీ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక గ్రాంటు విడుదల చేసింది. తద్వారా సొంతంగా డబ్బులు వెచ్చిస్తున్న పలువురు ప్రధానోపాధ్యాయులకు ఊరట దక్కింది.

## స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

**నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే :** డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు అన్నారు. స్టేడియంలో పారిశుద్ధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. స్టేడియం ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, గడ్డి నివారణకు ఎమ్మెల్యే మందు పిచికారి చేశారు. తాండవ కృష్ణ, వాసిరెడ్డి రవీంద్ర, అల్లూరి కోటేశ్వరరావు, శేఖర్, అధికారులు ఉన్నారు.

## ఉపాధి పనుల కార్యాచరణపై గ్రామసభలు

**యడ్లపాడు :** మండలంలోని తిమ్మాపురం, సొలస, మైదవోలులో మంగళవారం ఉపాధి హామీ పథకం పనుల కార్యాచరణ ప్రణాళికపై గ్రామసభలు నిర్వహించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో పనుల నిర్వహణకు గుర్తించిన పనుల వివరాలు సభలో తెలిపారు. పథకం ఏపీఎం రామారావు, టీఏ మాధవి, తిమ్మాపురం సర్పంచి ప్రభావతి, సొలస ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు పరిరక్షణ సమితి

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే :** జిల్లాలో మైనారిటీ హక్కుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మైనారిటీ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. జిల్లాలో ప్రాంతాల వారిగా సమితి కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ సుబ్లీ సూచించారని తెలిపారు.

# భావవ్యక్తీకరణకు పదును

## 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే :** 'ఈనాడు' ఆధ్వర్యంలో నరసరావుపేట జూపల్లి కూడలిలోని సన్‌షైన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో రాణించి వై.భావనశ్రీ (9వ తరగతి) ప్రథమ, ఎస్.సుకీర్తి (పదో తరగతి) ద్వితీయ, ఎం లాస్య దీపిక (8వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ ఎం. లక్ష్మి బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి ఎస్‌కే సుభాని, కృష్ణవేణి పర్యవేక్షించారు.



విజేతలైన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ లక్ష్మీ, ఉపాధ్యాయులు

• నరసరావుపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాణించిన బి.శివగణేష్ (పదో తరగతి) ప్రథమ, ఎస్కే మహబూబ్ సుభాని (పదో తరగతి) ద్వితీయ, కె.ఇమ్మానియేల్ (9వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు టి.రవికాంత్ బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు ఉపాధ్యాయిని అనిత పర్యవేక్షించారు.



ప్రతిభ చూపిన వారితో మున్సిపల్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

# ఎక్కడైతే ఏంటి?. ఆరాలి అంతే

చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద రోడ్డు విభాగిని స్థానికులకు ఉతికిన దుస్తులు ఆరేసుకోవటానికి ఉపయోగపడుతోంది. హైవే, సర్వీసు రోడ్డు మధ్య విభాగినిగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. వాటిపై స్థానికులు దుస్తులు ఆరేసుకుంటున్నారు.

**- న్యూస్‌టుడే, యడ్లపాడు**



ఇనుప గ్రిల్స్‌పై ఆరేసిన ఉతికిన దుస్తులు

# ఎన్నాళ్లు ఇలా వదిలేస్తారు?

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే :** నరసరావుపేట గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో ఆయా కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు ఎండకు ఎండి తుప్పు పడుతున్నాయి. రూ.వేలు వెచ్చించి కొన్న ఆటోలు తదితర వాహనాలు అనుకోని ప్రమాదాల్లో చిక్కుకొని పోలీస్ స్టేషన్‌కు చేరాయి. అయితే కేసులు పరిష్కరించి వాటిని తిరిగి బాధితులకు అప్పగించకపోవడంతో తుప్పుపట్టి పనికి రాకుండా పోతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.



తుప్పు పడుతున్న వాహనాలు

## విద్యార్థినికి ఆర్థిక సాయం

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే :** పేద విద్యార్థిని బిందు అనితకు వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం రూ.30 వేలు సాయం చేశారు. విద్యార్థిని చదువు నిమిత్తం కాపు వెంకట్రావు ఈ సాయం చేశారు. ఆమె బాగా చదువుకుని వృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో వి.వెంకట సత్యనారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అందుబాటులో ఉంటా : కోడెల శివరామ్

**రొంపిచర్ల, న్యూస్‌టుడే :** తెదేపా నేతలకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ అన్నారు. రొంపిచర్లలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన హజరాబీ కుమారుడైన హనీఫ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కూటమి ప్రభుత్వం హయాంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

## మొక్కలు నాటిన ఒయాసిస్ సభ్యులు

**చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా టిడ్కో గృహ సముదాయం వద్ద మంగళవారం ఒయాసిస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జనసేన నియోజక వర్గ సమన్వయకర్త తోట రాజ రమేష్, ఒయాసిస్ అధ్యక్షురాలు కందిమళ్ల జయమ్మ, కార్యదర్శి కరణం విజయలక్ష్మి, ఎన్.సుబ్బాయమ్మ, సంధ్య, మునీర్ పాల్గొన్నారు.

# బరిలో దిగితే పతకమే

శావల్యాపురం, న్యూస్‌టుడే

- శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రతిభ
- బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

క్రీడల్లో రాణించాలంటే ఆసక్తి.. పట్టుదల ఉండాలి. నిరంతర సాధనతో నైపుణ్యం పెంపొందించుకోవాలి. ఇలా శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు వ్యాయామోపాధ్యాయుడు రాగుల రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో తర్ఫీదు పొందుతూ స్కూల్ గేమ్స్ పోటీలతో పాటు, జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు. ఈ సందర్భంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

### తల్లిదండ్రుల ప్రోత్సాహంతో

క్రీడల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలన్న తాపత్రయంతో నిత్యం సాధన చేస్తున్నా. వ్యాయామోపాధ్యాయుడు సూచనలు, సలహాలతో ముందడుగు వేస్తున్నా. తల్లిదండ్రులు ఆనందరావు, పద్మ ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్ని పతకాలు సాధించా. నంద్యాల జిల్లా మహానందిలో సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని జాతీయ పోటీలకు అర్హత సాధించాను.. **– వేముల దివ్య**



### చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యం



బాల్ బ్యాడ్మింటన్ అంటే ఇష్టం. నిత్యం సాధన చేస్తున్నా. తండ్రి ముట్లూరి ప్రసాద్ వ్యవసాయ కూలీ. చదువుకుంటూనే క్రీడలకు సమయం వెచ్చిస్తున్నా. రెండింటికి సమ ప్రాధాన్యంతో రాణించాలన్నదే నా ఆశ. వ్యాయామోపాధ్యాయుడు ప్రోత్సాహం మరవలేనిది. ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించా.**– ముట్లూరి లూథియా**

### అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ..



మంచి క్రీడాకారిణిగా గుర్తింపు పొందడంతో పాటు ఉన్నత స్థాయి ఉద్యోగంలో స్థిరపడాలన్నదే నా లక్ష్యం. తండ్రి బండారు మరియబాబు ప్రైవేటు ట్రావెల్స్ డ్రైవరు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నా. ఇప్పటికే ఐదుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించా.**– బి.దేవమణి**

# పాలకుడు అంటే చంద్రబాబే

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** పాలకుడు ఎలా ఉండాలో.. సంక్షోభ సమయంలో కూడా సంక్షేమం, అభివృద్ధి మేళవింపుగా పరిపాలన ఎలా సాగించాలో జగన్ ఇప్పుడైనా సీఎం చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హితవు పలికారు. మండలంలోని గంగన్నపాలెం, కట్టుబడివారిపాలెంలో రూ.21 లక్షలతో సీసీ రహదారులు, కాలువ నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు.



గంగన్నపాలెంలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే పుల్లారావు

**చిలకలూరిపేట పట్టణం :** నియోజకవర్గంలోని పట్టణం, గ్రామాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం అందజేశారు.

## నిబంధనలు పాటించాల్సిందే

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** బాణసంచా హోల్‌సేల్ వ్యాపారం చేస్తున్నవారు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్ హెచ్చరించారు. 16వ నంబరు జాతీయ రహదారి పక్కన చిన పసుమర్రు, బొప్పూడి, మురికిపూడి పరిధిలో ఉన్న 12 బాణసంచా దుకాణాలను మంగళవారం రాత్రి తహసీల్దార్ తనిఖీ చేశారు. లైసెన్సుతో పాటు అగ్నిమాపక శాఖ అనుమతి, నీటి నిల్వలు తదితర నిబంధనలున్నీ అమలు చేయాలని చెప్పారు. నిబంధనలు పాటించని దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని అన్నారు. ఆర్ఐ షేక్ రమీజా ఆయన వెంట ఉన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మహ్మద్ హుస్సేన్, పక్కన ఆర్ఐ రమీజా

# అమరవీరుల త్యాగం మరువలేనిది

**నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే :** సమాజం బాగు కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని గ్రామీణ ఎస్సై కిషోర్ అన్నారు. పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి మండలంలోని కేసానుపల్లిలో విధి నిర్వహణలో అసువులు బాసిన కోటేశ్వరరావు, సాంబిరెడ్డిల విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 2003 జనవరి 5న మాచవరం మండలంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి వెళుతున్న సమయంలో మావోయిస్టులు జరిపిన బాంబు పేలుళ్లలో వీరు మృతి చెందారని చెప్పారు.



విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న ఎస్సై కిషోర్, సిబ్బంది

# షటిల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ

**చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే :** మండలంలోని పసుమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం హనుమంతరావు మంగళవారం తెలిపారు. నరసరావుపేటలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో జిల్లా నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొనగా తమ విద్యార్థులు షేక్ ఫర్వీన్, ఎ.శైలు, కె.కవిత, డి.దైవకీర్తి, షేక్ రషీద్, షేక్ సల్మాన్, షేక్ హబీబుల్లా, షేక్ వసీం ప్రతిభ చూపి ఎంపికైనట్లు చెప్పారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో పఠాన్ అల్తాఫ్ కూడా ఎంపికైనట్లు తెలిపారు. వారిని ఆయన అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## వైకాపా కార్యకర్తలకు ఆర్థిక సాయం

**నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే :** గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన రాజకీయ ఘర్షణల్లో గాయపడిన వైకాపా కార్యకర్తలకు ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం మంజూరు చేశారు. నరసరావుపేట పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు మాబు సుభాని, బాషాకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెక్కులు అందజేశారు.

## కేరిడ్జ్ పాఠశాలకు సీబీఎస్ఈ గుర్తింపు

**నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే :** నరసరావుపేటలోని కేరిడ్జ్ పాఠశాలకు కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ పర్యవేక్షించే సీబీఎస్ఈ బోర్డు గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం పాఠశాలను తనిఖీ చేసి పాటిస్తున్న విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు కల్పించిన వసతులు పరిశీలించారని ప్రధానోపాధ్యాయుడు బర్న్‌బాస్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పర్యవేక్షకులను పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె.నాసరయ్య ఉన్నారు.

## పేదలకు అన్నదానం

**చిలకలూరిపేట పట్టణం, నాదెండ్ల :** స్థానిక ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోనా బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు, కనపర్రు నైస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు మంగళవారం అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ తియ్యగూర కోటిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య రమాదేవి ఆర్థిక సహకారంతో విద్యార్థులకు అన్నదానం, కారుమంచి శివరావు భార్య సరళాదేవి వర్ధంతి పురస్కరించుకుని బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు సరకులు అందజేసినట్లు చెప్పారు. క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గణపవరం (నాదెండ్ల) :** గణపవరం తులసీవనం ఆశ్రమంలోని అనాథ వృద్ధులకు భాజపా ఓబీసీ రాష్ట్ర విభాగం ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు తన కుమారుడు ప్రభు చైతన్య జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు.

## రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు



వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ లోకనాథం

**మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే :** వ్యాపారులు దుకాణాల ఎదుట రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ లోకనాథం అన్నారు. పట్టణంలోని మోర్ సెంటర్, మార్కెట్ కూడలిలో మంగళవారం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

## భూ సమస్యలు పరిష్కరించండి

**యడ్లపాడు, వినుకొండ రూరల్, నరసరావుపేట సెంట్రల్, ఈపూరు, న్యూస్‌టుడే :** మండలంలోని సొలసలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 148 మంది దరఖాస్తులు అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని వీటితో పాటు రీసర్వే సమస్యలు తెలిమజేయవచ్చని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. వినుకొండ మండలం టి.అన్నవరంలో గ్రామసభ నిర్వహించారు. నరసరావుపేట మండలం మలకలూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు 18 అర్జీలు వచ్చాయని వీఆర్వో రామకృష్ణ తెలిపారు. ఈపూరు మండలం వనికుంటలో భూముల రీసర్వే కార్యక్రమంపై అభ్యంతరాలను స్వీకరించారు.

## బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలి

**నరసరావుపేట అర్బన్ :** జిల్లాలో బాల్య వివాహాల నిరోధక చట్టం 2006ను సమర్థంగా అమలు చేయాలని నీడ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ ప్రేమానందం కోరారు. ప్రత్యేకించి పల్నాడు ప్రాంతంలో బాల్య వివాహాలు అధిక సంఖ్యలో జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదే మాతా శిశువుల మరణాలకు కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# సామూహికంగా ఎలుకల నివారణ

**యడ్లపాడు, నూజండ్ల, వినుకొండ రూరల్, రొంపిచర్ల, నాదెండ్ల, న్యూస్‌టుడే :** రబీ సాగుకు అవసరమైన శనగ విత్తనాలను రైతులకు 25 శాతం రాయితీపై రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు ఏవో సీహెచ్ సరిత తెలిపారు. మండలంలోని సందెపూడి, తుర్లపాడులో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో పాల్గొన్నారు. పత్తి పంట పరిశీలించారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని నూజండ్ల ఏవో సుగుణా బేగం అన్నారు. రవ్వారం, ముప్పరాజువారిపాలెం, ఉప్పలపాడు రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమాన్ని చేపట్టారు. వినుకొండ మండలంలో కార్యక్రమం నిర్వహించారు. వరిలో ఎలుకల నివారణకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును 100 శాతం రాయితీపై సరఫరా చేసిందని ఏవో అంజిరెడ్డి తెలిపారు. రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి శివలలిత రైతులకు సూచనలు చేశారు. మాగాణి భూముల్లో సామూహిక ఎలుకల నివారణతో వరి పంటకు రక్షణ లభిస్తుందని, పది నుంచి 40 శాతం వరకు దిగుబడి నష్టం నివారణకు రైతులు కృషి చేయాలని నాదెండ్ల ఏవో హరిప్రసాదు సూచించారు. సాతులూరులో మాగాణి రైతులకు బ్రోమో డయాలిన్ మందును మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు.



వరిలో ఎలుకల నివారణకు సస్యరక్షణ చర్యలు తెలియజేస్తున్న ఏవో సరిత

## రైతు సేవా కేంద్రాల్లో సమృద్ధిగా ఎరువులు

**రొంపిచర్ల :** మండలంలో రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి శివలలిత తెలిపారు. మండలంలోని పలు రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల నిల్వలను ఆమె తనిఖీ చేశారు.

## ప్రాణరక్షణ కల్పించాలని ఎస్పీకి మొర



ఎస్పీని కలిసి సమస్య వివరిస్తున్న సందీప్

**చిలకలూరిపేట పట్టణం:** చిలకలూరిపేటలోని సర్వే నం.750లో మూడు సెంట్ల ఖాళీ స్థలం తనకు ఉందని, దాన్ని కొందరు ఆక్రమించడంతో న్యాయం కోసం తిరుగుతుండగా దౌర్జన్యం చేస్తున్నారని, ప్రాణరక్షణ కల్పించాలంటూ మాఖం సందీప్ మంగళవారం నరసరావుపేటలో ఎస్పీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశాడు. ఈ వ్యవహారంలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారని, పరిశీలించి న్యాయం చేయాలని విన్నవించారు.

## వెండి వస్తువుల అపహరణ

**చిలకలూరిపేట పట్టణం:** ఇంట్లో వెండి వస్తువులను అపహరించిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక శాంతినగర్‌కు చెందిన జి.మురళీమోహన్ జేసీబీ డ్రైవర్. మంగళవారం ఉదయం 6.30కు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా ఇంట్లో ఉన్న వెండి వస్తువులు కనిపించలేదు. ఏ మేరకు పోయాయే తెలియాల్సి ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

## అమరవీరుడికి నివాళి

**సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి మండలం గుడిపూడిలో సీఆర్పీఎఫ్ అమర జవాను శాఖమూరి మురళీకృష్ణ విగ్రహానికి గ్రామీణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ అమీరుద్దీన్, సిబ్బంది మంగళవారం నివాళి అర్పించారు. విధుల్లో భాగంగా మూడేళ్ల కిందట ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులతో పోరాడి వీరమరణం పొందిన మురళీకృష్ణ ధైర్య సాహసాలు, దేశభక్తిని కొనియాడారు. ఆయన తల్లిదండ్రులు విజయకుమారి, రవీంద్రబాబు, స్థానికులు పాల్గొన్నారు.



గుడిపూడిలో మురళీకృష్ణ విగ్రహానికి పోలీసులు, స్థానికుల నివాళి

## గొడవల జోలికి వెళ్లొద్దు

**సత్తెనపల్లి, న్యూస్‌టుడే:** గొడవలకు దూరంగా ఉంటూ.. కలిసిమెలిసి ప్రజలు జీవించాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రోసూరు మండలం గాదెవారిపాలెం చెందిన తెదేపా కార్యకర్తలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఆ గ్రామంలో జరిగిన ఘర్షణకు సంబంధించి వివరాలను మాజీ వైస్ ఎంపీపీ సూరయ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే ముప్పాళ్ల మండలం తొండపి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్తలను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావుకు శ్రీధర్ సూచించారు.



పార్టీ నాయకుడితో మాట్లాడుతున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

### మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? తేరాల చెంచుకాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు.
- వెంకటేశ్వర్లు, గ్రామవాసి

✔ సర్పంచితో మాట్లాడి, దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- వెంకటేష్, కార్యదర్శి

? పోలేపల్లి కొత్తూరులో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - గ్రామస్థులు

✔ సర్పంచి సహకారంతో దీపాలు ఏర్పాటుకు కృషి చేస్తా.
- ఏడుకొండలు, కార్యదర్శి

- న్యూస్‌టుడే, దుర్గి

? చర్లగుడిపాడు ఎస్సీ కాలనీలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. - కాలనీవాసులు

✔ ఇటీవల దీపాలు ఏర్పాటు చేశాం. పరిశీలించి వెలగని వాటికి మరమ్మతులు చేయిస్తాం. - దస్తగిరి, కార్యదర్శి

- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

? పట్టణంలోని వాకింగ్ ట్రాక్‌పై వర్షం పడినప్పుడు గేదెలు తిరగడంతో పాడైపోతోంది. గేదెలు ట్రాక్ మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలి. - రామారావు

✔ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి ప్రతిపాదనలు తయారు చేసి, నెల రోజుల్లో పనులు చేపడతాం.
- శ్రీధర్, మున్సిపల్ కమిషనర్

- న్యూస్‌టుడే, పిడుగురాళ్ల

? స్థానిక హిందూ శ్మశాన వాటిక ప్రహరీకి ఆనుకుని, రోడ్డు వెంట చెత్తాచెదారం పేరుకుపోయింది.
- కోటేశ్వరరావు, మాచవరం

✔ చెత్తా, చెదారాన్ని రెండు రోజుల్లో తొలగిస్తాం.
- రాగిడి నరేష్, సర్పంచి

| జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు: | దీపం కనెక్షన్లు: | ఉజ్వల్ యోజన: | ప్రస్తుతం గ్యాస్ బండ ధర: రూ. | ఉచిత గ్యాస్‌తో ఏడాదికి ఒక్కో కుటుంబానికి ఆదా: | జిల్లాలో ఏడాదికి అయ్యే ఆదా: రూ. |
|---|---|---|---|---|---|
| 6,31,626 | 1,66,067 | 8,239 | 844.50 | రూ. 2553 | 161.25 కోట్లు |

# దీపావళి వెలుగులు వచ్చేశాయ్!

### ఉచిత గ్యాస్‌తో పేదలకు ఉపశమనం
### రేపట్నుంచి బుకింగ్ అయ్యే సిలిండర్లకు లబ్ధి

**సత్తెనపల్లి, గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగించేలా.. వంటింటి కష్టాలకు చెల్లుచీటి పాడేలా దీపావళి ధమాకాను కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటోంది. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందించేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 24వ తేదీ నుంచి బుకింగ్ చేసుకునే సిలిండర్లకు లబ్ధి అందనుంది. 31 నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీ మొదలుకానుంది.

★ ఉజ్వల యోజనలో కనెక్షన్ పొందిన వారికి కేంద్రం ఒక్కో సిలిండర్‌కు రూ.300 రాయితీని బ్యాంకు ఖాతాలకు జమ చేస్తోంది. సాధారణ కనెక్షన్లకు కేంద్రం నుంచి కేవలం రూ.10.62 రాయితీ అందుతోంది. ఓ కుటుంబానికి సిలిండర్‌లోని గ్యాస్ నెలన్నర నుంచి రెండున్నర నెలలు వస్తుంది. పెద్ద కుటుంబమైతే నెలన్నరకే అయిపోయే పరిస్థితి. ఏడాదికి మూడు చొప్పున అందించే ఉచిత సిలిండర్లతో ఎన్నో కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.



### చంద్రబాబుపై నమ్మకం పెరిగింది - అలివేలు, గురజాల



గ్యాస్ సిలిండర్ల భారం పేదలపై పడుతోంది. కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే సామాన్యులు గ్యాస్‌తో వంట చేయాలంటేనే భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఊరట ఇస్తూ.. పథకం అమలు చేయడం సంతోషంగా ఉంది. ఎన్నికల హామీ నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబుపై మరింత నమ్మకం పెరిగింది.

### పేదలకు ఎంతో మేలు - లక్ష్మీ, చర్లగుడిపాడు



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తుండటంతో మాలాంటి పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. చిన్న కుటుంబాలకు ఏడాదికి మూడు లేదా నాలుగు సిలిండర్లు సరిపోతాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉంది.

### ఆర్థిక భారం తీరినట్లే - మల్లేశ్వరి, గురజాల



గ్యాస్ సిలిండర్ల ఖర్చు పేద కుటుంబాలకు భారంగా మారింది. మహిళలు ఇబ్బందులు గుర్తించి కూటమి ప్రభుత్వం ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గింది.

## 25న జాబ్‌మేళా

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 25న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు తెలిపారు. నియోజకవర్గంలోని యువత హాజరుకావచ్చన్నారు. జాబ్‌మేళాకు ఐసీఐసీఐ బ్యాంకు, అమరరాజా గ్రూప్, కె.ఎల్.టెక్నికల్ సర్వీసెస్ వంటి కంపెనీలు వస్తున్నాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు.

## ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

**గురజాల గ్రామీణ:** ఎల్ఐసీ బీమాను దెబ్బతీసే చర్యలు మానుకోవాలని ఏజెంట్ల యూనియన్ నాయకుడు సత్యన్నారాయణ కోరారు. గురజాల ఆంజనేయస్వామి దేవాలయంలో ఎల్ఐసీ ఏజెంట్లు మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పాలసీదారుల బోనస్ పెంచాలని, కమీషన్ పెంచాలని, పాలసీదారులకు జీఎస్టీ తగ్గించాలని కోరారు. అనంతరం ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

## మీసేవ కేంద్రంపై ఫిర్యాదు

**కారంపూడి:** మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో నిర్వహించే మీసేవ కేంద్రాన్ని కారంపూడికి మార్చడంపై మండల తెదేపా నాయకులు తహసీల్దారు ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మీసేవ కేంద్రాన్ని కారంపూడిలో నిర్వహిస్తూ ప్రజల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది ప్రోద్బలంతో గత వైకాపా ప్రభుత్వంలో ప్రజల నుంచి భారీ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలుఉన్నాయన్నారు.

## చిన్నారుల్లో చిరునవ్వులు నింపుదాం

**మాచర్ల (విజయపురిసౌత్), న్యూస్‌టుడే:** చిన్నారుల్లో చిరునవ్వులు నింపుదామని వైద్యాధికారి ఉదయభాను అన్నారు. మిషన్ సుహాస కార్యక్రమంలో భాగంగా మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలలో పల్నాడు జిల్లా ఆర్‌బీఎస్‌కే బృందం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. చిన్నపిల్లల నోటిలో పుట్టుకతో వచ్చిన సమస్యలు, పెదవి చీలిక, అంగిలి చీలిక వంటి సమస్యలకు వైద్యపరీక్షలు చేశారు.

## జూదరుల అరెస్ట్

**పెదకూరపాడు:** లింగంగుట్ల గ్రామంలో జూదం ఆడుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ.1150 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

**కొండూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే:** రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని కొండూరు జడ్పీ పాఠశాలకు విద్యార్థులు ప్రసన్న, దేవమణి, కాంత్రి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని సిస్టర్ బి.విజయకుమారి తెలిపారు. వచ్చేనెల 16న చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు.

**చదరంగంలో.. మాచర్ల(కారంపూడి):** రాష్ట్రస్థాయి అండర్-14 చెస్ టోర్నీకి మాచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని దీక్షితారెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ హనుమంతురావు తెలిపారు. ఈనెల 28, 29న శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలో పోటీల్లో పాల్గొంటుందని కోచ్ కిరణ్ పేర్కొన్నారు.

**ఖోఖోలో సత్తా..:** రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల పోటీలకు ఒప్పిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నాగశ్రీలక్ష్మి, శివమణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలలిత తెలిపారు.

## పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన

**అచ్చంపేట, న్యూస్‌టుడే:** రానున్న పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి అర్హులైన పట్టభద్రులతో ఓటు నమోదుకు మండల తెదేపా నాయకులు మంగళవారం పలు విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దరఖాస్తులు అందజేశారు. మండల తెదేపా అధ్యక్షుడు ఆశీర్వాదం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**సత్తెనపల్లి:** పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తెదేపా నాయకులు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పట్టభద్ర ఓటర్ల నమోదుకు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసరావుకు ఫారం-18లు అందజేశారు. అధ్యాపకులను కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు దివ్వెల శ్రీనివాసరావు, పూజల వెంకటకోటయ్య, మొక్కపాటి రామచంద్రరావు, అనుమోలు జయరామ్ పాల్గొన్నారు.



అచ్చంపేటలో తెదేపా నాయకుల ప్రచారం

# ప్రతిభకు పదును

### 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని భానోదయ పాఠశాలలో ప్రతిభాపాటవ పోటీలు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జె.నాగలక్ష్మీ (పదోతరగతి), సీహెచ్. పణిత్‌కుమార్ (ఎనిమిదో తరగతి), బి.సాధ్వి (తొమ్మిదవ తరగతి) విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయినులు బి.రజని, ఎ.జయలలిత విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

## రాయితీపై సౌరపలకలు

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌరపలకలను రాయితీతో అందజేస్తారని జిల్లా నోడల్ అధికారి సింగయ్య చెప్పారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయంలో ఎస్ఈ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూడు కిలోవాట్ల సౌర పలకలు ఏర్పాటు చేసుకున్న ప్రతి వినియోగదారుడికి ప్రభుత్వ రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు.

## ఎస్సై బాధ్యతల స్వీకరణ

**వెల్దుర్తి, న్యూస్‌టుడే:** వెల్దుర్తి ఎస్సైగా సమందర్‌వలి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై సత్యనారాయణ బదిలీపై వినుకొండ వెళ్లారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో యువకుడి దుర్మరణం

**పిడుగురాళ్ల, న్యూస్‌టుడే:** ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మంగళవారం రాత్రి మండలంలోని జూలకల్లు అడ్డరోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు ప్రకారం జూలకల్లు గ్రామానికి చెందిన ఇండ్ల నాగరాజు, సునీత, వారి కుమారుడు రాజేష్ ఏడాదిన్నర కిందట జీవనోపాధి కోసం రొంపిచర్ల మండలం అన్నవరపుపాడు గ్రామానికి వెళ్లారు. సునీత అమ్మ జూలకల్లులో నివసిస్తోంది. డ్వాక్రా డబ్బులు చెల్లించడానికి మంగళవారం ఉదయం వారు జూలకల్లుకు వచ్చారు. తల్లీదండ్రులు స్వగ్రామంలో ఉండటంతో రాజేష్ (21) అన్నవరపుపాడు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జూలకల్లు అడ్డరోడ్డు వద్దకు రాగానే కారంపూడి నుంచి గుత్తికొండ వైపు వెళ్లే ఆటో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. గ్రామీణ ఎస్సై మోహన్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

దాచేపల్లి మండలం పొందుగులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. చిన్న సమస్య కూడా గత పాలకులు పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు 15 ఏళ్ల కిందట నిర్మించారు. అవి దెబ్బతిన్నాయి. కాలువలు పూడిపోవడంతో మురుగు ప్రధాన రోడ్లపై పారుతోంది. అనేకసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. **- న్యూస్‌టుడే, దాచేపల్లి**



## అడుసు దాటితేనే ఊరు చేరేది..!



చినకొదమగుండ్ల-చిన గార్లపాడు గ్రామాల మధ్య రెడ్డి కుంట సమీపంలో గ్యాస్ పైప్ లైన్లు వేసేందుకు గోతులు తీసి మట్టితో కప్పేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రెండడుగుల మేర కుంగి ఆ ప్రాంతంలో వర్షపు నీరు చేరి, బురదమయంగా మారింది. ఈ మార్గంలో వాహనదారులు, బాటసారులు బురదలోంచి వెళుతూ జారిపడుతున్నారు. నల్లరేగడి మట్టితో గోతులు పూడ్చటంతో ఇబ్బందికరంగా మారింది. **- న్యూస్‌టుడే, కారంపూడి**

## అడుగు తడబడితే అంతే..



పట్టణంలోని 2వ వార్డులోని లెనిన్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు పనులు నాసిరకంగా చేపట్టడంతో పగుళ్లిచ్చింది. అడుగు తడబడితే కాళ్లు బెనికే విధంగా రోడ్డు తయారైంది. అధ్వాన రోడ్డుపైనే ఇబ్బంది పడుతూ కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇరువైపులా పిచ్చిచెట్లతో చిట్టడవిని తలపించేలా వాతావరణం ఉంది. డ్రైనేజీ లేకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

## కేంద్ర పథకాలు అందుతున్నాయా?

**మాచవరం, న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలించేందుకు జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యుడు లోహిత్ మంగళవారం మండలంలో పర్యటించారు. గంగిరెడ్డిపాలెం, శ్రీరుక్మిణీపాలెం గ్రామాలను సందర్శించి, స్థానిక సచివాలయాల్లో లబ్ధిదారులతో భేటీ అయ్యారు. పింఛన్, గృహ నిర్మాణ లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఏమైన ఇబ్బందులు ఉంటే చెప్పాలని కోరారు. అనంతరం ఉపాధి పథకం కింద చేపట్టిన పండ్ల తోటలు, సిమెంట్ రహదారులు, ప్రహరీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీడీ మల్లికార్జునరావు, గృహ నిర్మాణ శాఖ ఈఈ బాలాజీ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**క్రోసూరు(అచ్చంపేట):** క్రోసూరు మండలం నాగవరం, 88త్యాళ్లూరు, గరికపాడు గ్రామాల్లో మంగళవారం కేంద్ర బృందం అధికారులు పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామసభలు నిర్వహించి, క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నాగవరంలో డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. 88 త్యాళ్లూరు, గరికపాడు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. బృందం సభ్యులు శ్రీరాములురెడ్డి, లైజన్ ఆఫీసర్ డ్వామా పీడీ సిద్ధమూర్తి, డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఎంపీడీవో మహేష్‌బాబు, ఏపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కమిటీ సభ్యుడు

## ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

**న్యూస్‌టుడే, బృందం:** ఎలుకల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బ్రోమోడయోలిన్ మందును 100 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. మంగళవారం పలు ప్రాంతాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. బ్రోమోడయోలిన్ ప్యాకెట్లను రైతులకు అందజేశారు. పొలం గట్లపై, పోరంబోకు భూముల్లో ఎలుక బొరియలను మట్టితో మూసివేయాలని సూచించారు.

## మహిళ అదృశ్యం

**కారంపూడి, న్యూస్‌టుడే:** కొదమగుండ్ల గ్రామానికి చెందిన ఓ మహిళ సోమవారం స్వగ్రామం నుంచి కారంపూడి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె తల్లి లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## 'ఉల్లాస్' విజయవంతం చేయండి

**దాచేపల్లి, న్యూస్‌టుడే:** వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని విజయవంతం చేయాలనికి ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంతో పాటు జీవన నైపుణ్యాలలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే పథకం లక్ష్యమన్నారు.

# మాగాణి రైతుకు కష్టం

**రెంటచింతల, న్యూస్‌టుడే:** గత నెల రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గాలి, వానకు వరి పంట నేలవాలుతోంది. మంచికల్లు, పాలువాయిగేటు, రెంటాల, రెంటచింతల తదితర గ్రామాల్లో 5,417 ఎకరాల్లో వరి సాగైంది. అక్టోబరులో 124 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నెల సగటు వర్షపాతం 102 మిల్లీమీటర్లు మాత్రమే. మరో రెండు తుపాన్లు రానున్నాయని వాతావరణశాఖ ప్రకటనతో రైతులకు కునుకులేకుండా పోతోంది. ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. మరో నెల రోజుల్లో కోతకు వచ్చే దశలో విరిగిపడటంతో నష్టం వాటిల్లుతుంది. ఈ ఏడాది నూతనంగా మార్కెట్లోకి వచ్చిన ఓ హైబ్రిడ్ రకం పంట వాలినట్లు ఏఓ బ్రహ్మారెడ్డి తెలిపారు. తుపాన్లకు తట్టుకునే శక్తి ఆ విత్తనానికి లేదని రైతులు గ్రహించలేదన్నారు.



మంచికల్లులో వాలిన పంట

**గురజాల గ్రామీణ:** మండలంలో మాడుగుల, చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం, గురజాల తదితర గ్రామాల్లో వరి చేలు వెన్ను దశలో ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంట నేలకొరగడంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి రూ.35 వేలపైనే ఖర్చు చేసినట్లు చెబుతున్నారు.

## వీరభద్రస్వామి.. కష్టాలు తీర్చయ్యా!

**అచ్చంపేట, న్యూస్‌టుడే:** స్థానిక చామర్రు రహదారిలోని శ్రీవీరభద్రస్వామి కాలనీలో కనీస సౌకర్యాలకు నోచుకోక జనం ఇబ్బంది పడుతున్నారు. 2002లో కాలనీ ఏర్పాటైంది. 200కుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ అంతర్గత రహదారులు, సరైన విద్యుత్తు సౌకర్యం లేక, తాగునీటి సమస్యతో సతమతం అవుతున్నారు. ఇళ్ల వద్ద ముళ్ల పొదలు పెరిగాయి. చిన్నపాటి వర్షానికే రహదారులు బురదమయం అవుతున్నాయి. గుంతల్లో వర్షపునీరు చేరి రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. కాలనీలో రోడ్ల వెంట మెరకతోలి, సిమెంట్ రహదారులు నిర్మించాలని కోరుతున్నారు. కొన్ని లైన్లలో విద్యుత్తు స్తంభాలు లేవు. మూడు చేతిపంపులు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే లేరు. గత జులైలో కురిసిన వర్షాలకు కాలనీ ముంపునకు గురైంది.

★పోలీసు స్టేషన్ నుంచి చామర్రు వరకు సిమెంట్ రహదారి ఉన్నా, మురుగు కాలువ లేక ఇళ్లలోని వృథా నీరు రోడ్లపై చేరుతోంది. మాదిపాడు ఆర్అండ్‌బి రహదారిలో రైస్ మిల్లునుంచి సినిమాహాలు, రాగిచెట్టు కూడలి వరకు గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగాఉందని ప్రజలు ఆందోళనచెందుతున్నారు.



ఇటీవల వరదలకు ముంపునకు గురైన వీరభద్రస్వామికాలనీ